వస్తువులు, దుస్తులకు కేరాఫ్ ఎర్రగడ్డ

సంతకు వందేళ్ల చరిత్ర

- పాతబస్తీ నుంచి వ్యాపారులు
- పాత, కొత్త దుస్తుల క్రయ, విక్రయాలు



కొత్త వస్త్రాల దుకాణాలు



బాలికలు, మహిళల వస్త్రాల స్టాల్

ఎర్రగడ్డ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఆదివారం జరిగే ఎర్రగడ్డ సంతకు వందేళ్ల చరిత్ర ఉంది. దొరకని వస్తువే ఉండదని నానుడి. ఆ కాలం నుంచి ఇప్పటి వరకు సంతలో వివిధ రకాల వస్తువులు, వస్త్రాల క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. గుండుసూది మొదలుకుని డీజే, ఎలక్ట్రానిక్ వస్తువుల వరకు అన్నీ లభిస్తాయి. పాత బస్తీకి చెందిన వారే ఎక్కువగా వ్యాపారాలు చేస్తున్నారు. సంతను ఆధారంగా చేసుకుని ఎంతోమంది జీవనం కొనసాగిస్తున్నారు.



ఎర్రగడ్డ జాతీయ రహదారి పక్కన పాత వస్త్రాల వ్యాపారులు

నగరం నుంచే కాకుండా శివారు ప్రాంతాల నుంచి కూడా ప్రజలు ఎర్రగడ్డ సంతకు వచ్చి తమకు అవసరమున్న వస్తువులు, వస్త్రాలను కొనుగోలు చేస్తుంటారు. ఎలక్ట్రానిక్ వస్తువుల విషయానికి వస్తే ఫోన్లు, పాత బైక్‌లు, వాహనాలకు సంబంధించిన విడిభాగాలు, నట్లు, బోల్టులు పాత కాలం నాటి చెలామణిలో లేని కరెన్సీ నాణాలు తదితరాలు ఇక్కడ లభిస్తాయి. అంతేగాకుండా మేకలు, కోళ్లు, ఇళ్లలో పెంచుకునేందుకు కుందేళ్లు, కబుతరాలు తదితరాల పక్షులు, పశువుల విక్రయాలు కూడా జరుగుతుంటాయి. ఇంకా ఇంటి డెకరేషన్‌కు సంబంధించిన పరికరాలు, ఫర్నీచర్, కర్టెన్‌లు, పాతవి, కొత్తవి లభిస్తాయి.

ఎక్కువగా వస్త్రాల విక్రయాలు

సంతలో వస్త్రాల విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. అన్ని రకాల కొత్త, పాత వస్త్రాలు లభిస్తాయి. జాతీయ రహదారిపైన ఎర్రగడ్డ చౌరస్తా నుంచి మెట్రో రైల్వేస్టేషన్ వరకు ఇరువైపులా పాత దుస్తుల దుకాణాలు ఉన్నాయి. నగరంలోని ధనికులు, మధ్యతరగతి వారు తాము వాడిన పాత వస్త్రాలను ఇక్కడ అమ్ముతుంటారు. వారి వద్ద కొనుగోలు చేసిన దుస్తులను ఇక్కడి వ్యాపారులు వినియోగదారులకు విక్రయిస్తుంటారు. పాత వస్త్రాలలో ఇన్నర్‌వేర్‌లు మొదలుకుని చుడీదార్లు, చీరలు, డ్రెస్సులు, గాగ్రాలు, మిడ్డీలు, లెగ్గిన్‌లు, టాప్‌లు, ధోవతిలతో పాటు చిన్న పిల్లలకు సంబంధించిన అన్ని రకాల వస్త్రాలు ఇక్కడ లభ్యమవుతున్నాయి. ముఖ్యంగా దిగువ మధ్యతరగతి వారు పాతదుస్తులను ఎక్కువగా కొనుగోలు చేసి తమ అవసరాలు తీర్చుకుంటారు. అంతేగాకుండా జాతీయ రహదారి ఎర్రగడ్డ చౌరస్తా నుంచి సనత్‌నగర్ వైపు వెళ్లే దారిలో రెండు వైపులా కొత్త దుస్తుల దుకాణాలను ఏర్పాటు చేస్తారు. అన్ని రకాల కొత్త వస్త్రాలు తక్కువ ధరకు లభిస్తుండడంతో నగరవ్యాప్తంగా ఎక్కువమంది ఇక్కడకు వస్తుంటారు.



యువత దుస్తుల స్టాల్

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

కాపు సంఘం సభ్యులతో మంత్రుల ఆత్మీయ సమావేశం

గచ్చిబౌలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కొండాపూర్‌లోని మినర్వా హోటల్‌లో ఆదివారం కాపు సంఘం సభ్యుల ఆత్మీయ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాఘవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ మాజీ సభ్యుడు హనుమంతరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు పెద్దపీటవేస్తుందని, కాపు సోదరులకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాఘవరావు మాట్లాడుతూ అందరం కలిసి నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మిర్యాల ప్రీతం, గాలి అనిల్, శ్రీరామ్, రమేష్‌నాయుడు, శ్యామ్, కాపు సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



మధురానగర్ బస్తీలో ప్రచారం చేస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, డి.సీతక్క



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పదేళ్లు దోచుకుతిన్న బీఆర్‌ఎస్ నాయకులు

వెంగళరావునగర్/బోరబండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ అడ్డగోలుగా దోచుకున్న సొమ్ముతో టీవీలు, పేపర్లు పెట్టుకొని తప్పుడు వార్తలు రాస్తున్నాయని, ఎట్టి పరిస్థితుల్లో వాటిని నమ్మొద్దని రాష్ట్ర మంత్రులు డి.సీతక్క, జూపల్లి కృష్ణారావు అన్నారు. లక్షల కోట్ల అప్పులు చేసి తెచ్చుకున్న తెలంగాణను ఆగం చేశారని వారు ఆరోపించారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. బోరబండ మధురానగర్ బస్తీలో కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ఎంపీ మల్లు రవి, కార్పొరేటర్ ఎం.డి.బాబా ఫసియుద్దీన్ దంపతులతో కలిసి ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, ఖమ్మం కార్పొరేటర్ ఎం.డి.ముస్తఫా, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా, డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమాజిగూడలో..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సోమాజిగూడ ఇన్‌చార్జి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ వారి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఇప్పటికే ఎన్నో కార్యక్రమాలను చేపట్టిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నవీన్ యాదవ్, వర్ష యాదవ్, ఎమ్మెల్యేలు మక్కాన్ సింగ్, రాజ్ ఠాకూర్, విజయరమణారావు, మేడిపల్లి సత్యం, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, కార్పొరేటర్లు సంగీత యాదవ్, పి.విజయారెడ్డి, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడలో..

యూసుఫ్‌గూడ డివిజన్ కృష్ణానగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రచారం చేశారు. గత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి దూరం చేసిందని ఆయన విమర్శించారు.

నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఏఐఎంఐఎం ప్రచారం

ఆ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



ఎర్రగడ్డలో ప్రచారం చేస్తున్న ఏఐఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

ఎర్రగడ్డ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం ఎంఐఎం కేడర్ అంతా పనిచేస్తుందని ఆ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆదివారం రాత్రి ఆయన పార్టీ నాయకులతో కలిసి ఎర్రగడ్డలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ఏఐఎంఐఎం పార్టీ మద్దతు ఇస్తుందని తెలిపారు. ముస్లిం మైనార్టీ ఓటర్లు సైతం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్, యాకుత్‌పుర ఇన్‌చార్జి యాసర్ అరాఫత్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమీర్, సర్దార్, అజ్జు, తదితరులు పాల్గొన్నారు.

అకారణంగా నామినేషన్ తిరస్కరించిన అధికారులు

బర్కత్‌పుర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రక్షణ సమితి(టీఆర్‌ఎస్‌డీ) జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి కంచర్ల మంజూష నామినేషన్‌ను అధికారులు అకారణంగా తిరస్కరించారని ఆ పార్టీ అధ్యక్షుడు నరాల సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అభ్యర్థి మూడు సెట్ల నామినేషన్ దాఖలు చేశారని, వివరాలు చెప్పకుండా అధికారులు తిరస్కరించారని ఆరోపించారు. వీరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



సత్యనారాయణ

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా



వెంకటగిరిలో మన్ కీ బాత్ వింటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ నాయకులు



బోరబండలో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి

- బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా' అని బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి అన్నారు. బోరబండ బలహీనవర్గాల కాలనీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. గోశాలలో ప్రత్యేక పూజలు చేసి, ఆవులకు గ్రాసం తినిపించారు. ఈ సందర్భంగా దీపక్ రెడ్డి మాట్లాడుతూ పేదలు నివసించే బస్తీల్లో కనీస వసతులు కరువయ్యాయని విమర్శించారు. గత పాలకులు, నేటి అధికార పార్టీ అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. ఉప ఎన్నికలో బీజేపీకి ఓటు వేసి గెలిపిస్తే కేంద్రం నిధులతో బస్తీల్లో మౌలిక వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేష్, రాజేష్, షర్మిల జాదవ్, అన్నపూర్ణమ్మ, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మన్ కీ బాత్..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమం 127వ ఎపిసోడ్‌ను వెంకటగిరి చౌరస్తాలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గౌతమ్‌రావు, వేముల అశోక్, కుంబాల గంగరాజు, బి.జ్ఞానేశ్వర్, ప్రేమ్‌కుమార్, పులిరామ్, బి.సతీష్, కాట్రాజ్, గణేశ్, స్వప్న, నాగార్జున, నాగమణి, కవిత, కుమారి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



యూసుఫ్ గూడలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

అల్లకల్లోలం సృష్టిస్తున్న హైడ్రా

బోరబండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధే కనిపిస్తున్నదని, ఇప్పుడు మాత్రం హైడ్రా బుల్డోజర్ అల్లకల్లోలం సృష్టిస్తున్నదని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. యూసుఫ్‌గూడ బస్తీ, శ్రీకృష్ణానగర్, ఎల్‌ఎన్‌నగర్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తదితరులతో కలిసి ఆదివారం ఆయన ప్రచారం చేశారు. 58,59 జీవోలతో 50, 60 గజాల ఇళ్లకు పట్టాలిచ్చి పేదల ఆత్మస్థైర్యాన్ని, గౌరవాన్ని కేసీఆర్ పెంచారని చెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రాను తీసుకొచ్చి బుల్డోజర్లతో నిరుపేదల ఇళ్లను ఇష్టారీతిగా కూల్చివేస్తుండడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆశీష్ కుమార్ యాదవ్, వాసాల వెంకటేష్, గుండ్లపల్లి శేషగిరిరావు, కోట్ల వినోద్, పర్వతం సతీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక

వెంగళరావునగర్, మధురానగర్‌కు చెందిన యువ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ధర్మారెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డా.మెతుకు ఆనంద్ సమక్షంలో వారు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు విజయ్ ముదిరాజ్, ఆంజనేయులు యాదవ్, సురేష్ ముదిరాజ్, రామన్న, పూజారి బాల్‌రాజ్ పాల్గొన్నారు.



సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన నివాసంలో సన్మానించిన కేబీఆర్ పార్కు, వాకర్స్ అసోసియేషన్, తెలంగాణ పవర్ లిఫ్టింగ్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్‌గౌడ్, గోపాలకృష్ణగౌడ్, బొడ్డు ప్రసాద్‌గౌడ్ తదితరులు



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్

దేశం కోసం పనిచేసేలా ప్రేరణ

ఖైరతాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) కార్యకర్తలు అత్యవసర పరిస్థితుల్లో దేశం కోసం పనిచేసేలా ప్రేరణ పొందుతారని సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ తెలిపారు. ఆదివారం సోమాజిగూడ రాజ్ భవన్ రోడ్డులోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆమెచూర్ రేడియోలో చింతన్, సూరి ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'గోవా విముక్తిలో స్వయం సేవకుల పాత్ర' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా గోవా ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ గోవింద్ బి. పార్వట్కర్తో హాజరయ్యారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ దేశం కోసం పోరాడే తెగువ, దేశం కోసం జీవించే తత్వాన్ని ఆర్‌ఎస్‌ఎస్ నేర్పిస్తుందన్నారు. సంఘం శతాబ్ది ఉత్సవాల్లో కార్యకర్తల నుంచి కేవలం సమయాన్ని మాత్రమే ఆశిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా సూరి సీతారాం కుటుంబసభ్యులను సత్కారించారు. కార్యక్రమంలో ఎన్ఐఏఆర్ వ్యవస్థాపకులు సూరి శ్రీరామమూర్తి, ఆర్‌ఎస్‌ఎస్ గోల్కొండ భాగ్ సంఘచాలక్ కొండా శ్రీకాంత్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప

నిద్ర సంబంధిత శ్వాస లోపాలపై అవగాహన సదస్సు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పల్మనరీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో నిమ్స్‌లో నిద్ర సంబంధిత శ్వాస లోపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమం విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.నరేంద్ర కుమార్ పర్యవేక్షణలో ఎమర్జెన్సీ భవనంలో జరిగింది. నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం బీరప్ప మాట్లాడుతూ స్లీప్ అప్నియా అనేది చాలా సాధారణమైందే అయినప్పటికీ, తరచుగా గుర్తించబడని నిద్ర సమస్య అని, సమాజంలో ఇది విస్తృతంగా ఉందని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డా.త్రిపత్ దీప్ సింగ్, డా.వంశీకృష్ణ, లతా ఆర్.కస్తూరి హాజరయ్యారు. సదస్సులో అసోసియేట్ డీన్ ప్రొ. చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డా.శాంతివీర్, ప్రొఫెసర్ జి.కె.పరమజ్యోతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రాకేష్ కొడాటి, పల్మనరీ మెడిసిన్ విభాగం సిబ్బంది, విద్యార్థులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

బేగంపేటలో మంగళసూత్రం స్నాచింగ్

- కేకలు వేసిన మహిళ
- దొంగను పోలీసులకు అప్పగించిన స్థానికులు

బేగంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మంగళసూత్రం లాక్కొని పారిపోతున్న దొంగను స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన బేగంపేటలో ఆదివారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కె.దుర్గాభవాని(39) బేగంపేటలోని మయూరిమార్గ్, తాజ్ వివంతా హోటల్ సమీపంలో నివసిస్తుంది. ఓల్డ్ బేగంపేట ఎయిర్‌పోర్టులోని ఆర్‌ఎంఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటలకు విధులకు వెళ్తారు. ఆదివారం ఉదయం సుమారు 8.50 గంటలకు ఇంటి నుంచి నడుచుకుంటూ ఆఫీసు వైపు బయలుదేరారు. ఉదయం 9.05 గంటల సమయంలో బేగంపేటలోని ఐసీఐసీఐ బ్యాంక్ సమీపం, మెట్రో పిల్లర్ నంబర్లు 1339, 1340 వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలో ఉన్న సుమారు 3.7 తులాల బంగారం మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోతున్నాడు. దుర్గాభవాని కేకలు వేయగా, గమనించిన పాదచారులు స్పందించి దొంగను వెంబడించి పట్టుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దొంగను అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో నిందితుడు గుంటూరు జిల్లాకు చెందిన పాత నేరస్థుడు అశోక్(27)గా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రాంచందర్‌రావును సత్కరిస్తున్న బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ప్రతినిధులు

కార్తీక వన సమారాధనకు ఆహ్వానం

చిలకలగూడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో మల్లాపూర్, విఎన్ఆర్ గార్డెన్‌లో నవంబర్ 9న నిర్వహించనున్న కార్తీక వన సమారాధన, ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుకు ఆహ్వానపత్రిక అందజేసి, శాలువతో సత్కరించారు. ఆదివారం తనను కలిసిన ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడిన బ్రాహ్మణుల సంక్షేమానికి చర్యలు చేపట్టడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజగిరి కమిటీ సభ్యులు వాసుదేవరావు, మంగళంపల్లి మురళీ, జె.సుబ్రమణ్యం, పర్వత వర్ధిని, శర్మ, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస విశేష పూజా కార్యక్రమాలు

మారేడుపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో విశ్వవసునామ సంవత్సర కార్తీకమాస విశేష పూజా కార్యక్రమాలు నవంబరు 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని దేవాలయ ధర్మాదాయశాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్కందషష్ఠి అభిషేకం, ప్రత్యేక అలంకరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నవంబరు 5వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యానారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా భవాని మృత్యుంజయస్వామి వారికి మహన్యాస పూర్వక అభిషేకం, 8న సంకష్టహర చతుర్థి అభిషేకం, లక్ష్మీగణపతి హోమం, అభిషేకం, 12న కార్తీక అష్టమి అనఘాష్టమి వ్రతం, 17న సుదర్శన హోమం, 18న మాస శివరాత్రి ప్రత్యేక అభిషేకం, సాయంత్రం భవాని మృత్యుంజయస్వామి కల్యాణం వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.



వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న హనుమాన్ భక్తబృందం

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

బౌద్ధనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆర్యవైశ్యసంఘం నాయకుడు ప్రొద్దుటూరి వెంకటేశ్వరరావు(బాబు), పద్మ దంపతుల ఆధ్వర్యంలో తాడ్‌బండ్ హనుమాన్ భక్తబృందం ఆంజనేయస్వామి ముందు 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అంతకముందు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ డి.చందర్, ఆలయ సిబ్బంది రాము, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సుదర్శన నర్సింహ హోమం



సామూహిక సుదర్శన నర్సింహ హోమంలో పాల్గొన్న భక్తులు

బోయినపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి న్యూ సిటీ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగాణంలో ప్రధాన అర్చకుడు పవన్‌స్వామి ఆధ్వర్యంలో పెద్దఎత్తున సామూహిక సుదర్శన నర్సింహ హోమం వైభవంగా జరిగింది. అగ్ని ప్రతిష్ఠ చేసి మూలమంత్ర హోమం, సుదర్శన శతకం, మాల మంత్ర ప్రత్యేక పూజలు, గణపతి పూజతో హోమం ప్రారంభించి పూర్ణాహుతి, ఆశీర్వచనంతో సుదర్శన హోమం పరిపూర్ణమైంది. హోమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి వేద పండితులు ఆశీర్వాదం ఇచ్చారు. హోమం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేయడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.



ప్రత్యేక పూజలు

మహేంద్రాహిల్స్‌లోని జగన్నాథ మందిర్ గోశాల దేవాలయంలో ఆదివారం రాత్రి గోవర్ధన ప్రత్యేక పూజా ప్రార్థన, భజన కీర్తన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. - అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

అవస్థల్లో అడ్డగుట్ట

- అధ్వానంగా రోడ్లు
- మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగు
- శాశ్వత పరిష్కారం చూపని అధికారులు



అడ్డగుట్ట విద్యావాహిని స్కూలు పక్కన పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్

అడ్డగుట్ట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ప్రధాన రోడ్లు పాడైపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అలాగే అడ్డగుట్ట మజీద్ వద్ద మ్యాన్‌హోల్ నుంచి వెలువడుతున్న డ్రైనేజీ మురుగు గంగ జమునా హోటల్ మీదుగా విద్యావాహిని స్కూలు వరకు దాదాపు అర కిలోమీటర్ మేర రోడ్డుపై పారుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా అడ్డగుట్ట మజీద్ వద్ద రెండు మ్యాన్‌హోళ్ల నుంచి ఇరవై నాలుగు గంటలు మురుగు ఏరులై పారుతుంది. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే తాత్కాలికంగా పనులు చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపెట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. గంగ జమునా హోటల్ పక్కన దుకాణదారులు పుట్‌పాత్‌ను అక్రమించి సామాన్లు పెట్టడంతో రాకపోకలు ఇబ్బందిగా మారింది. మారేడుపల్లి గీతా నర్సింగ్ ఎదురుగా ప్రధాన రోడ్డులో దాదాపు ఏడాది క్రితం రోడ్డు పగిలిపోయి వర్షం పడిన సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు కలుగుతుంది. మారేడుపల్లి ఏటీసీ సెంటర్ నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే వాహనాలు ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటే భయపడుతున్నారు. ఉదయం సాయంత్రం వేళలలో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఇదే రోడ్డులో జీహెచ్ఎంసీ అధికారులు రాకపోకలు సాగిస్తున్నప్పటికి సమస్య పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా లోహియనగర్, ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ ఇదే పరిస్థితులు నెలకొంది. ఇప్పటికైనా అధికారులు ఎప్పటికప్పుడు పర్యటించి సమస్యలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించండి



చిన్నపాటి వర్షం చాలు ఎక్కడ పడితే అక్కడ బస్తీలో వర్షం నీరుతో పాటు డ్రైనేజీ మురుగు పొంగిపొర్లుతోంది. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

- ఉదయ్ యాదవ్, అడ్డగుట్ట

పట్టించుకోవడం లేదు



చిన్నపాటి వర్షానికే రోడ్ల పైకి వర్షం నీరు చేరుతుంది. కొన్ని గుడిసెల్లో నీళ్ల చేరి బస్తీవాసులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా ఎప్పటికప్పుడు డ్రైనేజీల్లో మట్టి నిల్వ ఉండకుండా తొలగిస్తే ఈ సమస్య రాదు. ఎక్కడైతే సమస్య ఉంటుందో అధికారులు అక్కడ పట్టించుకోవడంలేదు.

- శ్రీను నాయక్, అడ్డగుట్ట



మారేడుపల్లి గీతా నర్సింగ్ హోం ముందు శిథిలమైన రోడ్డు



గంగజమునా హోటల్ ముందు డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి పార్లుతున్న మురుగు



అడ్డగుట్ట గంగ జమునా హోటల్ పక్కన రోడ్డును ఆక్రమించడంతో డ్రైనేజీ నీరు నిల్వ ఉన్న దృశ్యం

శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

బౌద్ధనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస్‌నగర్ శ్రీగిరి పద్మావతి గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జీర్ణోద్ధరణ పూర్వక మహా సంప్రోక్షణ మహాకుంభాభిషేకంలో భాగంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన బింబపరీక్షా శాంతిహోమానికి విజయవాడకు చెందిన అష్టాక్షరి పీఠాధిపతి త్రిదండి అష్టాకరి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామివారు ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల నేతృత్వంలో అగ్నిప్రతిష్ఠ, యాగశాల, ద్వారతోరణధ్వజ, అర్చన, పూర్ణాహుతి, విష్ణుసహస్రనామార్చన, వేదపారాయణం, తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేష్‌కుమార్, కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, తమ్మన వేణుగోపాలరావు, దేవదాయశాఖ స్థపతి వలి నాయగం, కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, అత్మరామ సూర్యసుబ్రమణ్యం, లక్ష్మీనారాయణ, శివశంకరన్, నారాయణన్, సుజయ్‌ప్రకాశ్, శ్రీహరి, షణ్ముఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బింబపరీక్షా శాంతిహోమంలో పాల్గొన్న అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాకరీ సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామివారు

లక్ష్మీనారాయణ ఆలయంలో అన్నకూట్



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీమంత్రి మర్రి శశిధర్ రెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త రవీందర్ తదితరులు



స్వామివారి నైవేద్యాలు

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జనరల్ బజారులో శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం అన్నకూట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆలయంలో పోటు(వంటశాల)లో తయారైన మొత్తం ప్రసాదాలను స్వామివారి ముందు నైవేద్యంగా ఉంచి పూజా కార్యక్రమాలను నిర్వహించి వాటిని భక్తులకు శాత్తుముర్రై గోష్టి(సహపంక్తి)లో ప్రసాద వితరణ చేశారు. ఈ అన్నకూట్‌లో మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు దయానంద్, సీకే నర్సింగరావు తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్త గూమిడేల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నకోటి లేదా అన్నకూట్ అనేది హిందూమతంలో గోవర్ధన్ పూజ వేడుకలతో ప్రత్యేకించి శ్రీకృష్ణుడుకి సంబంధించి దగ్గర సంబంధం కలిగి ఉందని, పురాణాల ప్రకారం బృందావనం గ్రామస్తులను ఇంద్రుడి కోపం నుంచి రక్షించటానికి శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తడం వల్ల కృతజ్ఞతగా ప్రజలు కృష్ణుడికి తాము వండుకున్న వివిధ రకాల ఆహారాన్ని అందించారన్నారు. అప్పటినుంచి ఈ వేడుకను నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనువంశిక ధర్మకర్తలు గుమ్మడల్లి రవీందర్, శైలేష్, కార్తీక్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగులకు సత్కారం



గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగులతో ఓయూ వీసీ, ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు, ఉద్యోగులను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ఆదివారం సత్కరించారు. ఓయూ నుంచి దాదాపు 50 మందికి పైగా ఉన్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. ఉన్నత ఉద్యోగాలు సంపాదించిన వారంతా ప్రజల సమస్యలు పరిష్కరించటంలో సులభపద్ధతులను అన్వేషించాలని సూచించారు. భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండేలా ఉత్తమ ఉద్యోగులుగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన ప్రతి ఒక్కరినీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్డీ జితేంద్ర కుమార్ నాయక్, యూజీసీ వ్యవహారాల డీన్ లావణ్యలతో కలిసి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం సత్కరించారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అడ్మినిస్ట్రేషన్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వీ తేజ

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి: ఏబీవీపీ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రూ.8,500 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వీ తేజ డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ నెల 28న హైదరాబాద్ నగరాన్ని అష్టదిగ్బంధనం చేస్తామని, ఎమ్మెల్యేలు, మంత్రుల క్యాంప్ ఆఫీసులు ముట్టడిస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డిని గద్దె దింపే వరకు ఏబీవీపీ పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజు, సిటీ జాయింట్ సెక్రటరీ నందిని, ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు దృహన్, శివ శంకర్, యూనివర్సిటీ నాయకులు అన్వేష్, భువన్, జశ్వంత్ పాల్గొన్నారు.

అడ్డగుట్టలో టీడీపీ కార్యకర్తల సమావేశం

అడ్డగుట్ట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని సికింద్రాబాద్ నియోజకవర్గం టీడీపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు కాతా విజయ్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం డివిజన్‌లో టీడీపీ నాయకులు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వాదం పేరుతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబం తెలంగాణ ప్రజల్ని మోసం చేసి లక్షల కోట్లు సంపాదించారని ప్రజలే చెబుతున్నారన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఆనాటి మాజీ ఎమ్మెల్యే అల్లాడి రాజకుమార్ మొదలుకొని ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీలో ఉన్న ఆనాటి టీడీపీ మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హయంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధికార ప్రతినిధి కాసుల సుదర్శన్‌రెడ్డి, తార్నాక డివిజన్ అధ్యక్షుడు గండికోట విజయ్‌కుమార్, ఓర్సు మహేందర్, ఎ.విజయ్‌కుమార్, సురేష్, శ్రీనివాస్, విజయ్, రాము తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ క్యాంప్‌లో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత మెగా హెల్త్ క్యాంప్

తార్నాక, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను తార్నాకలోని కమ్మవారి సేవాసంఘం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. హెల్త్ క్యాంప్‌లో భాగంగా రోగులకు బీపీ, షుగర్, అల్ట్రాసౌండ్, స్ర్కీనింగ్ వంటి పలు వైద్య పరీక్షలను ఆస్పత్రి యాజమాన్యం ఉచితంగా నిర్వహించారు. మెడికవర్ హస్పిటల్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకునేందుకు హెల్త్ క్యాంపులు ఎంతో దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ సీనియర్ వైద్య నిపుణులు డా. సుజాత, డా. ఆర్. సత్యప్రకాష్, డా. పవన్, డా. కె.ఎ శ్రీనివాస రావు, డా. డి. సమీన్, డా. టి. రవి శంకర్, డా. డి. శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల విధుల గురించి విద్యార్థినులకు తెలియజేస్తున్న ఎస్ఐ

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థినులు

తిరుమలగిరి అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా తిరుమలగిరి లాల్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులు తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌ను ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. పోలీసులు విధి నిర్వహణ తీరు తెన్నులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు ఎఫ్ఐఆర్‌ను నమోదు ఎలా చేయాలి, నేరస్తుల పట్ల వ్యవహరించే తీరును సైతం వారికి పోలీసులు తెలియజేశారు. అలాగే పౌరుల సమస్యలను తెలుసుకుని పలు సూచనలు, సలహాలు ఇచ్చే విధానాన్ని కూడా వారికి తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని పద్మశాలి కల్యాణ మండపంలో నగర కమిషనర్ ఆదేశాల మేరకు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ఉత్సాహవంతులైన యువత ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని తిరుమలగిరి పోలీస్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కోరారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

వైన్‌షాప్ ముందు ధర్నాకు దిగిన ఎమ్మార్పీఎస్ నాయకులు



పృథ్వీ (ఫైల్)

బోయినపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వైన్‌షాపు పర్మిట్ రూంలో మద్యం సేవించి అనుమానాస్పదంగా ఓ యువకుడు మృతి చెందిన ఘటన బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మృతి చెందిన యువకుడి కుటుంబానికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ నాయకులు మృతదేహంతో వైన్స్ ముందు ధర్నా చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలంరాయి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పృథ్వీ(25) వృత్తిరీత్యా స్థానికంగా ఉన్న కేటరింగ్‌లో పనిచేస్తున్నాడు. నిత్యం మడఫోర్ట్ ధోబీ ఘాట్ ఎదురుగా ఉన్న ఎస్వీ వైన్స్‌లో మద్యం సేవించి వెళ్తూ ఉంటాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం 12 గంటల సమయంలో వైన్‌షాప్‌కి వచ్చి మద్యం సేవించాడు. అనంతరం కొద్దిసేపటికే అపస్మారక స్థితికి చేరుకొని కింద పడిపోయాడు. పర్మిట్ రూమ్ సిబ్బంది గమనించి వైన్స్ యజమానికి, మృతుడి సోదరుడికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడు హుటాహుటిన వైన్స్‌కు చేరుకొని అంబులెన్సులో గాంధీకి తీసుకెళ్లారు. గాంధీలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు మృతదేహంతో వైన్స్ ముందు బైటాయించి ధర్నాకు దిగారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వైన్స్‌లోని సీసీ పుటేజీలను స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మారేడుపల్లి గీతా నర్సింగ్ హోమ్ ఎదురుగా ప్రధాన రహదారి



మారేడుపల్లి నుంచి అడ్డగుట్ట వెళ్లే రహదారి



క్లాక్‌టవర్ వద్ద ఉన్న గార్డెన్ హోటల్ టర్నింగ్ రోడ్డు

గుంతలమయంగా రహదారులు

- పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు

సికింద్రాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నడిబొడ్డున రోడ్లు మరీ అధ్వానంగా మారడంతో ప్రజలు నరకయాతనకు గురవుతున్నారు. ఈ అధ్వాన రోడ్లన్నీ జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్, బేగంపేట్, సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయాల పరిసరాల్లో ఉండడం గమనార్హం. అయినప్పటికీ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేదంటూ ప్రజలు మండిపడుతున్నారు. మారేడుపల్లిలోని షెనాయ్ నర్సింగ్ హోమ్ ఎదురుగా, మారేడుపల్లి నుంచి అడ్డగుట్ట వెళ్లే రహదారిలో, క్లాక్‌టవర్ వద్దనున్న గార్డెన్ హోటల్ టర్నింగ్‌లో, సరోజినీ దేవి రోడ్డులోని బసేరా హోటల్ ఎదురుగా.. ఇలా చెప్పుకుంటూ వెళితే పలు కీలక రోడ్లు గుంతలమయంగా మారి, ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఈ అధ్వాన రోడ్లను బాగు చేయండి మహాప్రభో.... అంటూ జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్, బేగంపేట్ సర్కిల్ ఉపకమిషనర్, ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులు సహా ఎంతమందికి విజ్ఞప్తి చేసినా ప్రయోజనం కలగడం లేదని ప్రజలు వాపోతున్నారు. నిత్యం ఈ రహదారులపై రాకపోకలు సాగించే ప్రజాప్రతినిధులు సైతం ఈ రోడ్లను బాగు చేయించలేకపోతుండడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధ్వాన రోడ్ల సమస్యను బోనాల జాతర ముందు నుంచి ప్రజలు మొర పెట్టుకుంటున్నా, ఇప్పటి వరకూ సమస్య పరిష్కారం కాకపోవడం గమనార్హం. ఏవో కుంటిసాకులు చెబుతూ అధికారులు కాలయాపన చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



సరోజినీదేవి రోడ్డులోని బసేరా హోటల్ ఎదురుగా ప్రధాన రహదారి